క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



చేబ్రోలు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేబ్రోలు ఈవోపీఆర్డీ టి.ఉషారాణి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సచివాలయం సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై నాలుగురోజుల శిక్షణ కార్యక్రమంలో చివరి రోజు రెండో బ్యాచ్ శిక్షణ గురువారం పూర్తి అయింది. రెండో బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన వారికి మాస్టర్ ట్రైనర్‌లు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన గ్రామం, పరిశుభ్రమైన, పచ్చనైన గ్రామం, సామాజిక న్యాయం తదితర అంశాల గురించి వివరించారు. ఈవోపీఆర్డీ ఉషారాణి మాట్లాడుతూ శిక్షణలోని అంశాల ద్వారా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

తుమ్మలపాలెం యూపీ పాఠశాలకు ఎస్‌జీటీ

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: తుమ్మలపాలెం యూపీ పాఠశాలకు ఎస్‌జీటీని సర్దుబాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం యూపి పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు లేరని, విద్యార్థులు, ఉపాధ్యాయులు అగచాట్లు పడుతున్నారంటూ గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'నిబంధనాల సర్దుబాటు' కథనంపై డీఈవో స్పందించారు. నివేదిక అందజేయాలని మండల విద్యాశాఖాధికారును ఆదేశించారు. వారిచ్చిన నివేదిక ప్రకారం పాఠశాలలో నవంబరు 30వ తేదీ నాటికి ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారని, వారిలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉద్యోగ విరమణ చేశారని, ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం స్కూల్ అసిస్టెంట్లు అధికంగా ఉండటంతో వేరే పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)ను సర్దుబాటు చేశామన్నారు. కాగా ఉద్యోగ విరమణ చేసిన స్కూల్ అసిస్టెంట్ స్థానంలో మండలంలో అర్హత ఉన్న ఎస్‌జీటీని నియమించడం జరిగిందని డీఈవో చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వీఆర్‌ఏ మృతి



చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం వీఆర్‌ఏ గురువారం అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో వీఆర్‌ఏగా కారుమూరి పెద యోబు (65) పనిచేస్తున్నాడు. గ్రామంలో కాటికాపరి పనులు చేసే యోబు గురువారం సాయంత్రం స్థానిక బస్ షెల్టర్‌లో అనుమానస్పదస్థితిలో శవమై కనిపించాడు. తలపై బలమైన గాయం ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై చేబ్రోలు ఎస్‌ఐ నాగేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



ప్రత్తిపాడు: విద్యార్థులు చదువుకునే సమయంలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అనిర్వచనీయమన్నారు. గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ పి. మల్లికార్జున రావు మాట్లాడుతూ నూతన సాంకేతికతపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరంగా కృషి చేస్తున్నామన్నారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.వి.ఎస్. ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, డైరెక్టర్ చందు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న దిగుబడులకు
కత్తెర పోటు

పంటలో కత్తెర పురుగు ఉధృతి

- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించకుంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం
- దిగుబడులపై 50–80 శాతం ప్రభావం చూపే అవకాశం

ప్రత్తిపాడు: మొక్కజొన్న రైతులను కత్తెర పురుగు కలవరపెడుతోంది. పంటను కత్తెర పురుగు విస్తృతంగా ఆశించడంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది రబీలో రైతులు మొక్కజొన్న వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 200 ఎకరాల్లో, పెదనందిపాడు మండలంలో 1500 ఎకరాల్లో, కాకుమాను మండలంలో 140 ఎకరాల్లో, రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఈ సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే ఊహించని విధంగా పంటపై కత్తెర పురుగు దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పురుగు ఆకులను కొరకవడంతో పాటు మొవ్వును కూడా నాశనం చేస్తుంది. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



పురుగు తినగా మిగిలిన ఆకు

విత్తిన నాటి నుంచి..

మొక్కజొన్న పంటను విత్తిన నుంచి చివరి వరకు కత్తెర పురుగు ప్రభావం పైరుపై ఉంటోంది. ఈ పురుగు అన్ని దశల్లో పైరును ఆశిస్తుంది. ఆ ప్రభావంతో దిగుబడులు యాభై నుంచి ఎనభై శాతం వరకు తగ్గుతాయని అధికారుల అంచనా. అంటే సగటున పది క్వింటాళ్లు రావలసిన దిగుబడి ఐదు క్వింటాళ్ల నుంచి మూడు క్వింటాళ్లకు పడిపోతుందన్నది అధికారులు చెబుతున్న మాట.

యాజమాన్య పద్ధతులతో..

రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కొంత మేర పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు. ఇప్పటి వరకు విత్తుకోని రైతులు విత్తనశుద్ధి చేసుకుని సయాంత్రలోలిపోల్, థయోమిథాక్సోమ్‌ను ఐదు మి.లీ కిలో విత్తనాలకు కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. అలా చేయడం వలన 15–20 రోజుల వరకు పురుగు పైరును ఆశించదన్నారు. చేను చుట్టూ ఉన్న కలుపును తొలగించాలి. మొక్కజొన్నను ఏకపంటగా కాకుండా అంతరపంటగా కందిరకాలు సాగు చేసుకోవడం, ఎకరాకు ఐదారు లింగాకర్షక బుట్టలు అమర్చడం, ఎకరాకు పది పంగల కర్రలు ఉంచడం (పక్షులు పురుగు లార్వాలను తినేందుకు వీలుగా) చేయాలి.



పైరుని పరిశీలిస్తున్న రైతు

రసాయన పద్ధతులు

- మొక్క 30–35 రోజుల వ్యవధిలో ఉన్నప్పుడు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు నాలుగు కేజీల చొప్పున మొవ్వలో పడునట్లు పిచికారీ చేయాలి.
- 50–55 రోజుల వ్యవధిలో ఇమామ్ మెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లీటరు నీటికి, లేదా స్పెనోటోరియం 5 మి.లీ లీటరు నీటికి కలిపి పైరులో పిచికారీ చేయాలని సూచించారు.

విషపు ఎరల ద్వారానూ..

పురుగు ఉధృతిని విషపు ఎరల ద్వారా కూడా నియంత్రించవచ్చు. 10 కిలోల తవుడును కిలో బెల్లంతో తడిపి రాత్రంతా పులియబెట్టి, రెండవ రోజు పులియబెట్టిన పదార్థాంలో మోనోక్రోటోఫాస్ కలిపి ఉండలు చేసి మొవ్వలో పడునట్లు పిచికారీ చేయాలి. కత్తెర పురుగు లార్వా విషపు ఎర ఉండలు తిని చనిపోతుంది.

కాండం తొలుచు పురుగు ఉధృతి కూడా కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ పురుగులు మొక్కొజొన్న అంకురంలోనికి చేరి ఎదిగే అంకురాన్ని తింటుంది. దీంతో మొవ్వ చనిపోతుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి. కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉంది. యాజమాన్య పద్ధతులతో పురుగును నివారించకుంటే దిగుబడులపై యాభై నుండి ఎనభై శాతం పురుగు ప్రభావం పడుతుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

కె. అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

- కలెక్టర్ నాగలక్ష్మి
- అంకిరెడ్డిపాలెంలో రెవెన్యూ సదస్సు



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు రూరల్: ప్రజల వద్దకే వచ్చి వారి భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ఆర్‌డీఓ కె.శ్రీనివాసరావుతో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని రెవెన్యూ రికార్డులు, 1 బీ రిజిస్టర్‌తో సరిపోల్చి చూసి వారి దరఖాస్తులపై రిమార్కులు నమోదు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధి లోపు వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. పిటీషన్ దారులకు జిల్లా కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ అధికారులు అందరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పీజీఆర్‌ఎస్‌లో నమోదు చేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో ముఖ్యంగా రీ సర్వే, అడంగల్‌లో మార్పులు చేర్పులు, సర్వే నెంబర్లు సరి చేయడం, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు విక్రయాల అనంతరం పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రెవెన్యూ సదస్సులందు 56 సర్వీసులు ఉచితంగా ప్రజలు పొందవచ్చని తెలిపారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన ప్రతి ఫిర్యాదుదారుని నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటికి తప్పకుండా రసీదులు అందించాలని అధికారులకు సూచించారు.

ప్రతి దర ఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూ సంబంధమైన అంశాలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ శర్మ, ఆర్‌ఐ మాణిక్యరావు, సర్వేయర్ బాబు రావు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంబీటీఎస్‌లో ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు అతిథులు

గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో బీడబ్ల్యూఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జాయింట్ సెక్రటరీ ఆల్ ఇండియా జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ నంబూరు సుబ్బారావు, సెక్రటరీ కరస్పాండెంట్ టీజేపీఎస్ కాలేజీ కె.వి.బ్రహ్మం, బలరామకృష్ణయ్య స్పిన్నింగ్ మిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి బలరామకష్ణయ్యలు పాల్గొని క్రీడలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆటలకు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా, మానసికంగా ఎదగడానికి ఎంతో దోహదపడతాయన్నారు. నేడు గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జనవరి 28, 29,30వ తేదీలలో విశాఖపట్నంలో జరిగే పోటీలలో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ టి.శేఖర్ తెలిపారు. పోటీలలో ఇండివిడ్యువల్ ఛాంపియన్‌షిప్ కప్ ఫర్ బాయ్స్‌ని దేముడు అనే క్రీడాకారుడు గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫర్ మైనారిటీస్ నల్లపాడు కైవశం చేసుకున్నాడు. గేమ్స్ చాంపియన్షిప్ కప్ ఫర్ బాయ్స్‌ని బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ, స్పోర్ట్స్ చాంపియన్షిప్ ఫర్ బాయ్స్‌ని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ నల్లపాడు, ఓవరాల్ చాంపియన్షిప్ కప్ ఫర్ బాయ్స్‌ను ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్, నల్లపాడు గెలుపొందారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో ప్రతీ అర్జీ నమోదు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న జేసీ



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ జియా

జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ

ప్రత్తిపాడు: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చే ప్రతి అర్జీని పీజీఆర్‌ఎస్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు రెవెన్యూ పరిధిలోని వింజనంపాడు గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. హాజరైన జేసీ భార్గవ్‌తేజ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు, ప్రజల నుంచి అందిన అర్జీలకు వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా సదస్సుల్లో వచ్చే అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీదారులకు రిసిప్టులను ఇవ్వాలని ఆదేశించారు. వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

గొట్టిపాడులో ఐదు అర్జీలు..

ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో గురువారం తహసీల్దార్ జి. కరుణకుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతులు వివిధ రకాల భూ సంబంధ సమస్యలకు సంబంధించి తహసీల్దార్‌ను కలిసి అర్జీలు అందించారు. మ్యూటేషన్లకు సంబంధించి మొత్తం ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వి. గాయత్రిదేవి, డీటీ ధర్మతేజ పాల్గొన్నారు.

దొప్పలపూడి సదస్సుకు 11 అర్జీలు

పొన్నూరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. గురువారం మండలంలోని దొప్పలపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 11 అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మ్యుటూషన్లపై 3, పాస్‌బుక్ సమస్యలపై 7, డిజిటల్ సిగ్నేచర్ కోసం 1 అర్జీ వచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నరసింహారావు, డీటీ రాజా రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి వల్లభరావుపాలెంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందని, ప్రజలు సమస్యలపై వినతులు అందించాలని తహసీల్దార్ తెలిపారు.

ఆటపాటలతో కూడిన విద్య అందించాలి

పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులతో పాటు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా సమగ్రాభివృద్ధిని అందించడమే లక్ష్యంగా విద్యాబోధన జరగాలన్నారు. అంగన్‌వాడీ స్థాయి నుంచే పునాది వేయాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాఠశాలల్లోని విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్, ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, సమగ్ర శిక్ష సీఎంవో అనిల్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ నాదెండ్ల రామారావుకు అవార్డు

గుంటూరు రూరల్: ఫార్మసీ విద్యలో నైపుణ్యతలతో కూడిన విధనాలను అమలు చేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న వ్యక్తి ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు అని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. గురువారం నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామారావు స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, ఎల్సేవియర్, స్ప్రింగర్ వంటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన జర్నల్స్‌లో 200కు పైగా తన పరిశోధనా పత్రాలను ప్రచురించారన్నారు. 10 పేటెంట్ల ఆమోదం, 24 పేటెంట్లు ప్రచురించబడినవని, 7 పుస్తకాలు రచించి 32 మంది విద్యార్థులకు డాక్టరేట్‌లకు మార్గ నిర్దేశం చేసి పరిశోధనా రంగంలో తనదైన ముద్ర వేస్తూ ఎన్నో ఎకడమిక్ రీసెర్చ్ అవార్డులు అందుకున్న రామారావుకి అరుదైన సీనియర్ సైంటిస్ట్ అవార్డ్ వరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమానికి జార్ఖండ్ ఉషా మార్టిన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మధులికా కౌశిక్, గౌరవ అతిథిగా యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ జార్జియా డైరెక్టర్ ప్రొఫెసర్ స్వామి మతినిటి, సాంబశివలు హాజరై అవార్డును అందచేశారని తెలిపారు.

విద్యార్థుల వ్యక్తిగత అభ్యసనానికి దోహదం

ఇన్నోవేషన్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్ కార్యక్రమ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని: ఇన్నోవేషన్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్ కార్యక్రమం విద్యార్థుల వ్యక్తిగత అభ్యసనానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఇన్నోవేషన్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ , ఆర్డీఓ కె.శ్రీనివాస రావు లతో కలసి ప్రారంభించారు. డబ్ల్యుఈ. ఎక్స్‌ఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని వ్యక్తిగత అభ్యాసన లోపాలను గుర్తించి సరిచేసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఈ సంస్థ యొక్క కృషికి తగిన సహకారం అందించాలని తద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా వినూత్నంగా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు ఉపయోగించుకుని వంద శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. సంస్థ సీఈవో నవీన్ కుమార్, సంస్థ కో ఫౌండర్ పెమ్మసాని రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించడం కోసం సేవా దృక్పథంతో డబ్ల్యుఈ. ఎక్స్‌ఎల్ సంస్థ గుంటూరు జిల్లాలోని వెనిగండ్ల, నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టడం జరిగిందన్నారు. వెనిగండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక, డబ్ల్యు.ఎక్స్‌ఎల్ ఫౌండర్, సీఈఓ నవీన్‌కుమార్ లింగా, సంస్థ కో ఫౌండర్ పెమ్మసాని రమేష్, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

చేబ్రోలు తహసీల్దారు శ్రీనివాసశర్మ



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు కే శ్రీనివాసశర్మ

సుద్దపల్లి(చేబ్రోలు): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని తహసీల్దారు కే శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో మ్యూటేషన్లు, అడంగల్, సర్వే, తదితర అంశాలపై 28 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దారు శ్రీనివాసశర్మ తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ మైలా వెంకట రామరాజు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఆరుగురిపై కేసు నమోదు

గుండవరం(చేబ్రోలు): స్థల వివాదంలో జరిగిన ఘర్షణలో దాడి చేసి గాయపరిచిన సంఘటనకు కారణమైన ఆరుగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ గురువారం తెలిపారు. చేబ్రోలు మండలం గుండవరం గ్రామానికి చెందిన సాతర్ల గోపీకి, పెదనాన్న కుమారులకు మధ్య స్థల వివాదం జరిగింది. సాతర్ల వెంకటేశ్వర్లు, భార్య, కుమారులు మొత్తం ఆరుగురి కలిసి దాడి చేసి గాయపరిచారు. బాధితుడు గోపి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫెర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



ప్రత్తిపాడు: ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వచ్చిన ఏడీఏ శ్రీనివాసాచార్యులు, ఏవో అరుణ్ కుమార్ లు గురువారం తనిఖీలు చేశారు. ఎరువులు విక్రయించిన తరువాత వ్యాపారులు ఈ–పాస్ మిషన్‌లలో నమోదు చేయక పోవడంతో స్టాకు నిల్వల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో కమిషనర్ కార్యాలయం నుండి వచ్చిన ప్రత్యేక బృందం స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. జిల్లా మొత్తంలో సుమారుగా 157 దుకాణాల్లో 1200 మెట్రిక్ టన్నుల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించడంతో కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య



గుంటూరు రూరల్: నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్లకు చెందిన వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దు

పట్నంబజారు: ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని ఎత్తురోడ్డు సెంటర్, మార్కెట్ సెంటర్‌తోపాటు పలు ప్రాంతాల్లో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వివరించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ హెల్మెట్ అనేది ప్రమాద సమయంలో ప్రతి ఒక్క వాహనదారుడికి అస్త్రంలా ఉపయోగపడుతోందన్నారు. ఇటీవల జరిగిన పలు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్ల మృతిచెందారన్న విషయాన్ని తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై హైకోర్టు కూడా స్పందించి హెల్మెట్ ధారణ తప్పనిసరిగా ధరించాలని చెప్పిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నడుచుకోవాలన్నారు.

పెనుగొండకు అభినందనలు

లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఏర్పడిన నాటి నుంచి సంస్థ సభ్యుడిగా సంస్థ కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం పట్ల అవగాహన సంస్థ అభినందలు తెలుపుతుందని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. 2024 సంవత్సరానికి లక్ష్మీనారాయణ రచించిన దీపిక అనే సాహిత్య విమర్శనా సంపుటికి ఈ పురస్కారం ఇవ్వాలని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించడం అవగాహన సంస్థ ప్రశంసిస్తుందన్నారు. సాహితీ కొండగా ప్రసిద్ధి చెందిన పెనుగొండ 50 సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్ళ అధిగమించారన్నారు.

విద్యార్థుల ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడాలి

కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



ప్రత్తిపాడు: సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు చేసే నూతన ఆవిష్కరణలు ఉండాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 24 హాక్‌మేళా గురువారం ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన డెవలపర్లు, ఇంజినీర్లు, టెక్ ఎంతుయాజిస్టులు పాల్గొని కోడింగ్, హార్డ్‌వేర్ ప్రోటోటైపింగ్‌పై పలు ఆవిష్కరణలు చేశారు. నిపుణులతో నిర్వహించిన మెంటార్‌షిప్ కార్యక్రమంలో ఆయా పరిశ్రమల నిర్వాహకులు పెట్టుబడులు. పరిశ్రమల రూపకల్పనపై దిశానిర్దేశం చేశారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు పాల్గొన్నారు. హాక్‌మేళా కేవలం సాంకేతిక పోటీ మాత్రమే కాదని నెట్‌వర్కింగ్ అవకాశాలను అందిపుచ్చుకునే సృజనాత్మక వేదికని తెలిపారు. ఫ్లాష్‌మాబ్, డీజేవంటి కార్యక్రమాలతో విద్యార్థులు అదరగొట్టారు.